సాక్షి
చిత్తూరు
గురువారం । 13 । మార్చి । 2025



డామిట్ కథ అడ్డం తిరిగింది!

అప్పులు తీర్చాలని పథకం వేస్తే డామిట్ కథ అడ్డం తిరిగింది. చిత్తూరులో బుధవారం భారీ చోరీకి యత్నం జరిగింది. - 8లో



పాఠశాల స్థలం కబ్జాకు యత్నం

పొదలపల్లెలో కూటమి నేతలు స్కూలు స్థలం కబ్జాకు యత్నించారు. అడ్డుకున్న మహిళపై దాడులు చేశారు. - 8లో



పంటలపై గజదాడులు

పెద్దపంజాణి మండలం మదిరెడ్డిపల్లెలో పంటలపై ఏనుగులు మంగళవారం రాత్రి దాడులు చేశాయి. - 8లో

రంజాన్ వేళలు	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
చిత్తూరు	6-28	5-02
పుంగనూరు	6-30	5-05

న్యూస్‌రీల్

ఎన్‌సీడీ సర్వే వేగవంతం చేయండి



గ్రామంలో సర్వేని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుధారాణి

నింద్ర: ఎన్‌సీడీ సర్వే వేగవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. నింద్ర ప్రభుత్వ వైద్యశాలను ఆమె బుధవారం తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్య సేవలు వందశాతం అమలుకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ, ఎఫ్‌ఆర్ఎస్ కోఆర్డినేటర్ నవీన్ తేజ్, నింద్ర వైద్యాధికారి వినిషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు న్యాయశాఖ స్థలం 25 సెంట్ల అప్పగింత



నూతన ప్రహరీ నిర్మాణం కోసం న్యాయవాదులతో కలిసి పూజలు చేస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో హైరోడ్డు విస్తరణ కోసం తన పరిధిలోని 25 సెంట్ల భూమిని జిల్లా న్యాయశాఖ కార్పొరేషన్‌కు అప్పగించింది. ప్రస్తుతం నగరంలో హైరోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వ భూములను కార్పొరేషన్ అధికారులు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా న్యాయశాఖ ప్రహరీలోపల ఉన్న 25 సెంట్ల భూమిని హైకోర్టు ఆదేశాలతో కార్పొరేషన్‌కు అప్పగించారు. దీంతో ఇప్పటికే ఉన్న ప్రహరీని తొలగించి, కొత్తగా ప్రహరీ నిర్మించడానికి కార్పొరేషన్ అధికారులు బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నగర అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్ న్యాయవాదులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో విద్యార్థి డిబార్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పదో రోజు పరీక్షలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు డీవీఈఓ సయ్యద్‌మౌలా వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సోమల మండలం ఎస్‌కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 14,034 మంది విద్యార్థులకుగాను 13,424 మంది హాజరుకాగా, 610 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

నేడు కవయిత్రి మొల్ల జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో గురువారం కవయిత్రి అటుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో సంఘ నాయకులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

లెవెల్ క్రాసింగ్‌లు మూసివేత

చిత్తూరు కలెక్టరేట్ : రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంలో జిల్లాలో రేణిగుంట–అరక్కోణం సెక్షన్ పరిధిలోని లెవెల్ క్రాసింగ్‌లు మూసివేయనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేణిగుంట– అరక్కోణం సెక్షన్ పరిధిలో నగరి–వేపగుంట, వేపగుంట యార్డు, వేపగుంట–పుత్తూరు, తడుకు యార్డులో ఉన్న లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటుకు రైల్వే శాఖ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతోందన్నారు. ఈ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడుతున్నందున లెవెల్ క్రాసింగ్‌లను శాశ్వతంగా మూసి వేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యువత పోరు.. హోరు

కూటమి సర్కారు కరుణిస్తుందని నిరుపేద విద్యార్థులు, నిరుద్యోగులు ఆశపడ్డారు.. ఎన్నికల్లో బాబు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారేమోని ఎదురుచూశారు.. విద్యకు భంగం కలగకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తారేమోనని పది నెలలు పడిగాపులు కాశారు. డీఎస్సీతోపాటు ఇతర కొలువులు ఇస్తారని వేచి చూశారు. ఎప్పుడిస్తారో తెలియక ఆందోళన చెందారు.. సర్కారు నిర్లక్ష్య వైఖరితో విసిగి వేసారిపోయారు.. ఆవేదనతో నలిగిపోయారు. ఆగ్రహంతో రగిలిపోయారు.. ఈ క్రమంలో తల్లడిల్లిన నిరుపేద విద్యార్థులు, నిరుద్యోగుల గుండె మండింది. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన యువత పోరుకు నిరుద్యోగులు, యువకులు పోటెత్తారు. జగనన్న పాలనలో సజావుగా అందిన పథకాలను గుర్తు చేసుకున్నారు. చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి నేతృత్వంలో యువత పోరు హోరెత్తింది. యువత కదంతొక్కింది. కలెక్టరేట్‌ను ముట్టడించి ఆందోళనకు దిగింది. ప్రజా విద్రోహ పాలనకు వ్యతిరేకంగా నినదించింది.

- ప్రశ్నిస్తామన్న పవన్ నువ్వెక్కడయ్యా!
- అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు డిమాండ్ల పరిష్కారానికి వినతిపత్రం అందజేత
- తరలివచ్చిన వేలాది మంది నిరుద్యోగులు, విద్యార్థులు, నేతలు, కార్యకర్తలు

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో యువత కదం తొక్కారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు భృతి అందించాలని, మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అమూల్ డెయిరీ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. దారి పొడవునా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ యువకులు ముందుకు సాగారు. సమస్యలు ప్రశ్నిస్తామన్న పవన్‌కళ్యాణ్ ఏమయ్యారని ప్రశ్నించారు. కలెక్టరేట్ వద్ద యువకులు, నాయకులను పోలీసులులోనికి పంపించకుండా అడ్డుకున్నారు. కూటమి టీడీపీ, పోలీసుల వైఖరిని నిరసిస్తూ గంటకు పైగా యువకులు కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి ధర్నా చేశారు. లోనికి పంపకుండా అడ్డుకున్న పోలీసుల వైఖరికి నిరసనగా మహిళలు సైతం గేటు వద్ద బైఠాయించి, నినాదాలు చేశారు. అనంతరం రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్య నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని కలిసి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి కార్యక్రమంలో పాల్గొన్న 1500 మంది నిరుద్యోగులు, విద్యార్థులు, నాయకులు కార్యకర్తలు తమ డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు, పలమనేరు మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, వెంకటేగౌడ, జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, నాయకులు, ప్రజాప్రతినిధులు గాయత్రీదేవి, లీనారెడ్డి, హరిణిరెడ్డి, గౌహతి సుబ్బారెడ్డి, అంజలిరెడ్డి, ధనంజయరెడ్డి, కుమార్ రాజా, కేపీ శ్రీధర్, జయపాల్, ప్రకాష్, జ్ఞానజగదీష్, రాహుల్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, శశిదీప్‌రెడ్డి, విష్ణు, సోమశేఖర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, హరిరెడ్డి, మనోహర్, శిరీష్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చిన్నారెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దామోదర్‌రాజు, సుధాకర్‌రెడ్డి, ఎం.రెడ్డెప్ప, కేశవులు, కృష్ణమూర్తి, బాగారెడ్డి, గణేష్ యాదవ్, ప్రహ్లాద, గిరిరాజారెడ్డి, గురవారెడ్డి, విజయబాబు, మణి, సరితజనార్ధన్, కిషోర్‌కుమార్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మునిరాజారెడ్డి, హరిబాబు, విజయ్‌కుమార్‌రెడ్డి, అన్బుఅలగన్ పాల్గొన్నారు.



నిలువునా మోసం చేశారు

–వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : చంద్రబాబు ఎప్పటిలాగే యువతను నిలువునా మోసం చేశారని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని విద్యార్థులు, ఉద్యోగాలు లేని నిరుద్యోగుల పక్షాన బుధవారం జిల్లా కేంద్రంలో యువత పోరు హోరెత్తింది. జిల్లా కేంద్రంలోని అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు, నిరుద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. అనంతరం డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. యువత పోరులో పాల్గొన్న పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టామన్నారు. పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు నాడు దివంగత వైఎస్సార్ ఫీజురీయింబర్స్‌మెంట్‌ను అమలు చేశారన్నారు. అలాగే గత ఐదేళ్లలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న వసతిదీవెన, విద్యాదీవెన పథకాలతో సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు అందించారన్నారు. ప్రస్తుతం ఐదో త్రైమాసికం జరుగుతున్నా ఇప్పటివరకు ఉన్నతవిద్య చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయలేదన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు కళాశాలకు వెళ్లకుండా వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌పై పోరును కొనసాగిస్తామని చెప్పారు.

యువతకు నిరుద్యోగ భృతి ఎక్కడ ?

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వస్తానే నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కూటమి మాట నిలబెట్టుకోలేదని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు ఎప్పటి లాగే ఈసారి కూడా నిరుద్యోగులను మోసగించారని విమర్శించారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,200 కోట్లు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. 2014లో ఇలానే ఎలాంటి హామీలు అమలు చేయలేదన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల్లో గత ఐదేళ్లల్లో రూ.18 వేల కోట్లు రాష్ట్ర వ్యాప్తంగా ఖర్చు చేసినట్లు తెలిపారు. 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వాటిని ప్రస్తుతం చంద్రబాబు ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కళాశాలలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న మద్యం బ్రాండ్‌లనే ప్రస్తుతం విక్రయిస్తూ, ధరలు పెంచి మరీ దోచుకుంటున్నట్లు విమర్శించారు.



విలేకరులతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి

గేట్లకు తాళం వేసి.. మహిళల దురుసుగా ప్రవర్తించి..



గేటు వద్ద ధర్నా చేస్తున్న మహిళా నేతలు

యువత పోరుకు విచ్చేసిన మహిళలను పోలీసులు దురుసు ప్రవర్తనతో కలెక్టరేట్‌లోనికి రానివ్వకుండా నెట్టేశారు. వన్‌టౌన్ సీఐ మహిళలను లోనికి రానివ్వకుండా కలెక్టరేట్ గేట్లకు తాళం వేసి దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఆగ్రహించిన రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హరిణిరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ మహిళ విభాగం అధ్యక్షురాలు గాయత్రీదేవి నాయకులు హరిషారెడ్డి గంట పాటు గేటు వద్దే బైఠాయించి కూటమి తీరుపై నినాదాలు చేశారు. లోనికి అనుమతి లేదని చెప్పాల్సిన పోలీసులు ఇలా మెహన గేటు వేసి దురుసు ధోరణి ప్రవర్తించడం దారుణమని గాయత్రీదేవి మండిపడ్డారు. మహిళలను కంట్రోల్ చేసేందుకు మహిళా పోలీసులను బందోబస్తులో పెట్టుకోకపోవడం సరికాదన్నారు. విద్యార్థులు, యువత సమస్యలపై శాంతియుతంగా నిరసన చేసేందుకు వస్తే దురుసుగా ప్రవర్తించడం అన్యాయమన్నారు.

నిరుద్యోగులకు నిలువునా మోసం



కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో మాటలు, హామీలు తప్పితే అమలు చేయడం లేదు. వేలాది మంది వాటిపై ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఉద్యోగం రాక, కుటుంబ పోషణ భారమై సతమతమవుతున్నారు. ఎన్నికల ముందు ఉద్యోగాలు ఇస్తాం లేకుంటే , నిరుద్యోగ భృతి కల్పిస్తామని చంద్రబాబు హామీనిచ్చారు. అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా భృతి మాటే లేదు.

– శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

ఇంటికో ఉద్యోగం కల్పించాలి



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు ఇంటికో ఉద్యోగం కల్పించాలి. దీనికి సంబంధించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రతినెల రూ.3వేల నిరుద్యోగభృతి మంజూరు చేయాలి. అలా చేస్తే ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లకు వెళ్లే పేద విద్యార్థులకు వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

– భరత్, ఎమ్మెల్సీ

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం



విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలి. ఎన్నికల ముందు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగభృతి ఇవ్వాలి. కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తూ పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేయడానికి నిరసిస్తున్నాం. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ఉద్యోగాలు భర్తీ చేయాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యువతపోరు కార్యక్రమం అధినేత జగనన్న ఆదేశాల మేరకు నిర్వహించం. – విజయానందరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త

హామీలకు అతీగతి లేదు



ఎన్నికల ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇంతవరకు అతీగతీ లేదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏటా విద్యార్థులకు వసతిదీవెన, విద్యాదీవెన తదితర పథకాలు పక్కాగా అమలు జరిగేవి. దీంతో పిల్లలను చదవించడం సులువయ్యేది. ఇప్పుడు అప్పులు చేయాల్సి వస్తోంది.

– రెడ్డెప్ప, మాజీ ఎంపీ

యువతకు భంగపాటు



విద్యార్థులతో పాటు నిరుద్యోగులకు సైతం సీఎం చంద్రబాబునాయుడు మోసం చేశారు. ఇంతవరకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసెత్తలేదు. విద్యార్థులు ఫీజులు కట్టలేక అనేక బాధలు పడుతున్నారు. ఉన్నత విద్య చదువుకొని ఉద్యోగాలు రాక చంద్రబాబు ఇచ్చే నిరుద్యోగభృతి కోసం ఎదురు చూస్తున్నాం. ఎప్పుడు ఇస్తారనేది స్పష్టత లేదు. చెప్పినదానికి చేసిన దానికి పొంతన లేదు.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే పలమనేరు

ప్రైవేటు పరం చేయడం తగదు



వైద్య విద్యను ప్రైవేటు పరం చేయటం తగదు. పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు కార్పొరేట్ సేవలు అందించాలన్న సంకల్పంతో మాజీ సీఎం జగనన్న వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం పేదల ఆశలను అడియాసలు చేస్తూ కళాశాలలను ప్రైవేటు పరం చేయటం దారుణం . ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించాలి.

– సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు

ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలి



కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలన్నీ భర్తీ చేయాలి. అలాగే ప్రభుత్వ పోస్టులను సైతం నింపాల్సి ఉంది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా పరిశ్రమల ఏర్పాటు చేయడం, చిన్న పరిశ్రమలతో చాలా వరకు నిరుద్యోగాన్ని తగ్గించవచ్చు. నిరుద్యోగభృతి అందజేస్తే పోటీ పరీక్షలకు వెళ్లేవారికి మంచిది. ఆ దిశగా సర్కార్ అడుగులు వేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– కృపాలక్ష్మి, జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త



ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు విజయానందరెడ్డి, వెంకటేగౌడ, సునీల్‌కుమార్, కృపాలక్ష్మి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు

వాణిజ్య పంటల సాగుపై విస్తృత అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రైతులకు వాణిజ్య పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ కార్యచరణ ప్రణాళికల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతుల దృష్టిని వాణిజ్య పంటల సాగు వైపు మళ్లించాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళికృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పరిశ్రమలో మాక్‌డ్రిల్ తప్పనిసరి

జిల్లాలోని ప్రతి పరిశ్రమలో కచ్చితంగా అధికారుల సమక్షంలో మాక్‌డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదేశించారు. జిల్లాలో రసాయనాల ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

జిల్లాలోని తహసీల్దార్లు వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెలాఖరులోపు కరెక్షన్లు పూర్తి చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం

ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో, నగరాల్లో బోర్ల మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీలను గుర్తిస్తున్నట్లు చెప్పారు.

ఒంటి..తుంటరి మళ్లీ వచ్చింది!

తమిళనాడు నుంచి వెనక్కి..



ఒంటరి ఏనుగు కదలికలను పరిశీలిస్తున్న అటవీశాఖ

గుడిపాల: ఒంటరి ఏనుగు.. భలే తుంటరి.. తమిళనాడు ప్రాంతానికి వెళ్లినట్టే వెళ్లి 24 గంటలు గడవక ముందే మళ్లీ తిరిగి వెనక్కి వచ్చేసింది. బుధవారం సాయంత్రం గుడిపాల మండలంలోని పల్లూరు గ్రామానికి సమీపంలో మకాం వేసింది. సాయంత్రం రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఏనుగును చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులు బాణసంచా పేల్చి అటవీప్రాంతంలోకి తరిమారు. రోడ్డు పక్కన ఎక్కువగా వరి, చెరుకు, మామిడి పంటలున్నాయి. రాత్రి వేళలో పంటను తినేందుకు ఒంటరి ఏనుగు రావచ్చని ఎవరూ కూడా రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లవద్దని పల్లూరు, పానాటూరు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏనుగు కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరెడ్డి తెలిపారు. తూర్పు, పడమర అటవీశాఖ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, మధు, ఢిల్లీరాణి, అరుణ ఏనుగు కదలికలపై కన్నేసి ఉంచారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

"ఊరంతా అప్పులు. ఒక్క దోపిడీ చేస్తే, వచ్చేదాంతో అప్పులన్నీ కొట్టేయచ్చు. చోరీల్లో ఆరితేరినవాళ్లను సాయం అడిగితే వచ్చేదాంట్లో వాటాలు అడుగుతారు. తలా రూ.2 వేలు ఇస్తే నా వద్ద పనిచేసేవాళ్లే వచ్చేస్తారు. ఇక అంతా సిద్ధం. పదండి లోపలకు.." అన్నాడు ముఠా నాయకుడు. డామిట్ అప్పుడే కథ అడ్డం తిరిగింది. భవన యజమాని ప్రతిఘటించాడు. స్థానికంగా ఉన్న యువకులు పిచ్చ కొట్టొడుకొట్టారు. ఒకరి కాలు విరిగింది. మరొకరికి మొహం మారిపోయింది. తీరా పోలీసుల రంగ ప్రవేశంతో ఉత్కంఠ నెలకొన్నా.. చివర్లో అందరూ ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు.

- ఒక్క దోపిడీతో.. అప్పులన్నీ కొట్టేద్దామనే ఆశ
- చిత్తూరులో రచ్చరచ్చ చేసిన కొత్త దొంగలు
- బొమ్మ తుపాకీలతో పట్టపగలు ఇంట్లో చోరీకి యత్నం
- ప్రతిఘటించిన యజమాని.. స్థానికులే హీరోలైన వైనం
- జిల్లా ఎస్పీ నుంచి.. ఆక్టోపస్ బలగాల పరుగులు
- కంటిమీద కునుకులేక.. ఆపై ఊపిరి తీసుకున్న ఖాకీలు



నిందితులున్న భవనంలోకి వెళుతున్న పోలీసులు, భవనాన్ని చుట్టుముడుతున్న ఆక్టోపస్ బలగాలు, (ఇన్‌సెట్‌లో) నిందితుల వద్ద లభించిన తుపాకులు


నిందితుల దాడిలో గాయపడిన భవన యజమాని చంద్రశేఖర్, ప్రధాన నిందితుడు సుబ్రమణ్యం రెడ్డిని బంధిస్తున్న స్థానికులు, మీడియాతో మాట్లాడుతున్న ఉమాపతి, అతని స్నేహితులు

చిత్తూరు అర్బన్: నగరంలోని గాంధీరోడ్డులో బుధవారం చోరీ యత్నం జరిగింది. ఈ ఘటన సంక్షిప్తంగా..

ఉదయం 6.28 గంటలు:

చిత్తూరు నగరంలోని గాంధీరోడ్డు–లక్ష్మీ థియేటర్ కూడలి వద్ద ఓ మారుతి ఓమ్నీ వ్యాను వచ్చి ఆగింది. అందులోంచి దిగిన ఆరుగురికి పైగా వ్యక్తులు ఎదురుగా ఉన్న 'పుష్ప షాపింగ్ కిడ్ వరల్డ్' దుకాణం పైన ఉన్న చంద్రశేఖర్ ఇంట్లోకి చొరబడ్డారు.

ఉదయం 6.35 గంటలు:

మొహానికి మాస్కులు, టోపీలు పెట్టుకున్న వ్యక్తులు చంద్రశేఖర్, అతని తల్లి సరస్వతి, భార్య శాంతి వైపు తుపాకులు చూపించి, బంధించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారు నగలు బ్యాగులో వేయాలని చెబుతుండగా.. చంద్రశేఖర్ పెద్దగా కేకలు వేయడంతో పైఅంతస్తులో ఉన్న కుమారుడు లోకేష్, ఇతని భార్య మానస పరుగు పరుగున కింద అంతస్తులోకి వచ్చారు. వాళ్లకు తుపాకీ చూపి కింద కూర్చోపెట్టారు.

6.40 గంటలు:

చంద్రశేఖర్ ప్రతిఘటించడంతో తల, చేతికి గాయాలయ్యాయి. నిందితుల్లో ఒకరు బొమ్మ తుపాకీ పేల్చగా, అది టప్ మంటూ శబ్దం చేసింది. వెంటనే తప్పించుకున్న లోకేష్ రోడ్డుపైకి వచ్చి సాయం కోసం అరవడం, చంద్రశేఖర్ మిద్దెపై నుంచే దొంగలు అని కేకలు వేశారు.

6.57 గంటలు:

స్థానికంగా టీ తాగడానికి వచ్చిన ఉమాపతి, అతని స్నేహితులు హుటాహుటిన దొంగలు ఉన్న భవనంలోకి ప్రవేశించారు. వీళ్లను చూసిన వెంటనే ఇద్దరు పారిపోయారు. ఇక ఉమాపతి గొంతుకు కత్తి పెట్టడంతో నిందితుడిని కాలితో తన్నాడు. కత్తి కిందపడడంతో స్థానికులంతా కలిసి నిందితులపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. తాళ్ల సాయంతో నలుగురు నిందితులను కట్టేసి, పోలీసులకు సమాచారం అందించారు.

7.23 గంటలు:

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నలుగురు నిందితులను స్థానికులు, పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు తుపాకులతో ఇంట్లోనే ఉన్నట్లు చెప్పడంతో అలజడి మొదలైంది. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య తన సిబ్బందితో కలిసి మరో భవనం నుంచి చంద్రశేఖర్ ఇంట్లోకి ప్రవేశించారు. అందర్నీ బయటకు తీసుకొచ్చారు.

7.47 గంటలు:

ఎస్పీ మణికంఠ ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుల వద్ద ఆయుధాలున్నాయనే సమాచారం రావడంతో సాయుధ బలగాలను రప్పించారు. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించి చేతుల్లో తుపాకులు పట్టుకున్న అధికారులు, సిబ్బంది భవనం లోపలకు వెళుతున్నారు, బయటకు వస్తున్నారు. కానీ ఏం జరుగుతోందో ఎవ్వరికీ అర్థం కావడంలేదు.

8.10 గంటలు:

నిందితులు వచ్చిన కారుకు తమిళనాడుకు చెందిన ద్విచక్రవాహన నంబర్ వేసుకోవడంతోపాటు, ప్రెస్ అని స్టిక్కర్ వేసుకోవడం, కారులో కత్తి, పెట్రోలు గుర్తించిన పోలీసులు దీన్ని చిన్న ఘటనగా భావించలేదు. విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.

9 గంటలు:

తిరుమలలో ఉన్న ఆక్టోపస్ బలగాల సాయం తీసుకోవాలని డీజీపీ చెప్పడంతో.. ఎస్పీ మణికంఠ వారిని చిత్తూరుకు రప్పించారు.

9.30 గంటలు:

20 మందికి పైగా ఉన్న ఆక్టోపస్ బలగాలు ఘటనా స్థలం మొత్తాన్ని జల్లెడ పట్టాయి. చుట్టుపక్కల భవనాల్లో సైతం వెతికినా పారిపోయిన నిందితుల ఆచూకీ లభ్యం కాలేదు.

10 గంటలు:

పోలీసుల ఆపరేషన్ ముగిసింది. అందరూ వెనుతిరుగుతున్న సమయంలో... ఘటన జరిగిన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్యాంకు ఉంది. దొంగలు బ్యాంకులో దాక్కున్నారా..? బ్యాంకును దోచుకోవడానికి వచ్చారా..? అనే ప్రశ్నలు తలెత్తడంతో మళ్లీ ఆక్టోపస్ బలగాలు బ్యాంకులోకి తుపాకులతో ప్రవేశించి, వెతికినా ఎవరూ కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకుని ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్లిపోయారు.

సీన్ కట్ చేస్తే..

చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ భవనం వెనుక ఉన్న జీకే నగర్‌లో కాపురముంటున్న సుబ్రమణ్యంరెడ్డి 16 ఏళ్ల క్రితం కర్నూలు నుంచి వచ్చి ఇక్కడ సోఫాలు తయారు చేసి విక్రయిస్తున్నాడు. అందరికీ అప్పులు ఇచ్చి, ఆర్థికంగా నష్టపోవడంతో ఒక్క దోపిడీ చేసి అప్పులన్నీ సెటిల్ చేద్దామని ఇలా తొలి ప్రయత్నంగా చోరీకి ప్రయత్నించి చావుదెబ్బలు తిని.. కటకటాలపాలయ్యాడు. సుబ్రమణ్యంరెడ్డితోపాటు కర్నూలు, అనంతపురం జిల్లాకు చెందిన నవీన్, ఇబ్రహీమ్ బాషా, ప్రవీణ్, రామాంజనేయులు పోలీసులకు చిక్కగా.. రాజేష్‌తో పాటు మరో ఇద్దరు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. గురువారం ఈ ఘటనపై వివరాలను మీడియాకు వివరించే అవకాశం ఉంది. చంద్రశేఖర్ బ్యాంకుల నుంచి నగదు తీసుకెళ్లడాన్ని చూసి, పది రోజుల పాటు రెక్కీ నిర్వహించినా ఫలితం లేకుండా పోయిందని నిందితులు తెగ మదనపడిపోవడం కొసమెరుపు.


ఆక్టోపస్ బలగాల మోహరింపు..

క్లుప్తంగా

బ్రాస్లెట్ అప్పగింత

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న బంగారు బ్రాస్లెట్‌ను ఆమెకు తిరిగి అప్పగించారు. బంగారుపాళెం మండలం నల్లంగాడు గ్రామానికి చెందిన కీర్తన బుధవారం కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఈ క్రమంలో చేతిలోని సుమారు 14 గ్రాములు బ్రాస్లెట్ ఆలయంలో జారి పడిపోయింది. ఇది గమనించిన అటెండర్ వీరముణి ఆ ఆభరణాన్ని తీసుకుని అధికారులకు అప్పగించారు. అనంతరం ఆ ఆభరణం ఎవరిదన్న విషయం ఆరా తీసి, హోంగార్డు వినాయకం, ఆలయ ఏఈఓ రవీంద్రబాబుతో కలిసి బాధితురాలు కీర్తనకు అప్పగించారు.

జెడ్పీ బడ్జెట్ ఆమోదం

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ బడ్జెట్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం జీఓ నెంబర్ 151ను బుధవారం విడుదల చేసింది. 2024–2025కు సంబంధించి అధికారులు పంపిన రివైజ్డ్ బడ్జెట్ పరంగా ఆదాయం రూ.4,133 కోట్లు, వ్యయం రూ.4,039 కోట్లకు అంగీకారం తెలిపింది. ఏడాది చివరిలో జెడ్పీలోని 11 అనుబంధశాఖల పరంగా పెట్టిన ఖర్చు, వ్యయం వివరాల నివేదిక ప్రభుత్వానికి పంపుతారు.

మహిళా అభ్యున్నతికి కృషి

కుప్పం: మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. బుధవారం జైపూర్‌కు చెందిన ప్రైమ్ టైర్ మార్కెట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కంపెనీ యాజమాన్యం కుప్పం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా ఆర్థికాభివృద్ధిపై మహిళలకు రెండు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థపై అవగాహన, డిజిటల్ విధానంలో కొనుగోలు, లావాదేవీలు తదితర అంశాలపై అవగాహన కల్పించి మహిళలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేందుకు ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పలుచోట్ల సంస్థ చేపట్టిన కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకర్షితులై ప్రయోగాత్మకంగా కుప్పంలో ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి దశగా కుప్పం మండలంలో ప్రైమ్‌టైర్ మార్కెటింగ్ సంస్థ వంద మంది మహిళలతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైమ్‌టైర్ మార్కెట్ ప్రతినిధులు అజేతాషాన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

15 మందిపై కేసులు


దేగల ప్రభాకర్ పలమనేరు డీఎస్పీ

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పట్టణంలో మంగళవారం విద్యార్థులకు సంబంధించిన గొడవలో కొందరు గ్యాంగ్‌లు చేరి, గొడవలకు కారణమై ఆపై పోలీసుల విధులను అడ్డుకున్న సంఘటనలకు సంబంధించి 15 మందిపై కేసు నమోదు చేసినట్టు పలమనేరు డీఎస్పీ దేగల ప్రభాకర్ బుధవారం తెలిపారు. కొందరి బైక్‌లను స్వాధీనం చేసుకుని వారిపై దాడి చేయడం, విచారణకు వచ్చిన పోలీసులపై దౌర్జన్యం, కార్డ్ అండ్ సర్చ్‌లో మారణాయుధాలకు సంబంధించి కేసులు నమోదు చేశారు. దీంతో పాటు పట్టణంలోని పలు అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన తెలిపారు. మరోవైపు రెండ్రోజుల్లో రౌడీ షీటర్లు, గంజా స్మగర్లు, ఆకతాయిలు, జులాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆలయం వద్ద మద్యం షాపు వద్దు


ఎక్సైజ్ ఎస్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

పుత్తూరు: స్థానిక నగరంరోడ్డులోని శ్రీఆంజనేయస్వామి ఆలయ సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని, ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లో మద్యం షాపును ఏర్పాటు చేయవద్దని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఎక్సైజ్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఆలయం ఎదురుగానే గ్రంథాలయం, సినిమా హాలు ఉన్నాయని. ఇక్కడ మద్యం షాపునకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. నగరం రోడ్డు అనునిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉంటుందని, ఇదే ప్రదేశంలో పలు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ మద్యం షాపు ప్రారంభిస్తే, తాగి తూలుతూ తిరిగే మద్యం ప్రియులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. ఇక్కడి పరిస్థితులను అనుసరించి అధికారులు మద్యం దుకాణానికి అనుమతులు ఇవ్వకూడదని వారు కోరుతున్నారు.

పంటలపై గజ దాడులు

పెద్దపంజాణి: మండలంలోని పలమనేరు రేంజ్ కీలపట్ల ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు ముదిరెడ్డిపల్లికి చెందిన రమణారెడ్డి తదితరుల టమాట పంటను తొక్కి నాశనం చేశాయి. మామిడి చెట్లను విరిచేశాయని బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ బుధవారం పంట నష్టాన్ని పరిశీలించారు. నష్టపరిహారం మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. ఏనుగులు పంటలపైకి రాకుండా ట్రాకర్ల సాయంతో అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ ఆటవీ సరిహద్దు గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, బందార్లపల్లి, జిట్టంవారిపల్లి, గౌరీనగర్, ఆకులవారిపల్లి రైతులకు చెందిన పంటలను గత కొంతకాలంగా ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగుల దాడుల్లో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

హోంగార్డు అని చెప్పి చితకబాదాడు!


బాధితురాలు సుగుణ

వెదురుకుప్పం: పొలంలో పనిచేసుకుంటున్న తనపై ఓ వ్యక్తి హోంగార్డు అని చెప్పి మహిళ అని చూడకుండా చితకబాదినట్లు మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన సుగుణ బుధవారం వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. తాను పొలంలో పని చేసుకుంటుండగా మా ఊరు కాదు మా మండలం కాని ప్రకాష్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై వచ్చి, తనపై దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డాడు. 2012 నుంచి తమ అనుభవంలో ఉన్న భూమిలో పనులు చేసుకుంటుండగా ప్రకాష్ వచ్చి, ఇది తమ భూమి అని చెప్పి బెదిరించాడు. తమ ఊరికొచ్చి తమ పొలం వద్దకు వచ్చి అకారణంగా తమను చంపేస్తామని బెదిరించి కొట్టి గాయపరచినట్లు విలపించింది. మెడలో ఉన్న నల్ల పూసల దండ, వేలుకి ఉన్న ఉంగరాన్ని కూడా తీసుకుని వెళ్లిపోయినట్లు తెలిపింది. అరుపులు, కేకలు వేస్తున్నా ఏ మాత్రం కనికరించకుండా అడ్డు వచ్చిన మా అక్క, మా భావపై కూడా దాడికి పాల్పడినట్లు చెప్పింది. దాడికి పాల్పడిన ప్రకాష్ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది.

చిత్తూరు: వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప



పలమనేరు: ఆవిర్భావదినోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు



ఆవిర్భావం.. వైభవం


చిత్తూరు: వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి, వందనం చేస్తున్న విజయానందరెడ్డి, నాయకులు

సాక్షి నెట్‌వర్క్: యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ(వైఎస్సార్ సీపీ) ఆవిర్భావ దిన వేడుకలను బుధవారం ఆ పార్టీ శ్రేణులు వైభవంగా నిర్వహించాయి. చిత్తూరులో ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. కార్వేటినగరంలో ఆ పార్టీ గంగాధరనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి పాల్గొని, వేడుకలు జరుపుకున్నారు. కుప్పంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు హఫీజ్, శాంతిపురంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి పాల్గొన్నారు. పలమనేరులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొని, పార్టీ జెండా ఆవిష్కరించి, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బంగారుపాళెంలో జరిగిన కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. నగరి టవర్‌క్లాక్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.




బంగారుపాళెం: కరిడివారిపల్లెలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్, నాయకులు, కార్వేటినగరంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి, శాంతిపురంలో జెండా ఆవిష్కరించి, వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

పోటీతత్వంతో ఉన్నత భవిత


విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న అశోకరాజు తదితరులు

నారాయణవనం: యువ ఇంజినీర్లు పోటీతత్వం పెంపొందించుకుంటే ఉన్నత భవిష్యత్ పొందవచ్చని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు తెలిపారు. బుధవారం కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో జుబిలేషన్ డే నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం అశోక్‌రాజు మాట్లాడుతూ జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, కుటుంబ సభ్యులకు సమయం కేటాయించాలని సూచించారు. మంచి జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం ఆయనను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలోనే వివిధ క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జుబిలేషన్‌లో భాగంగా గురువారం చేపట్టే కార్యక్రమాలకు జేఎన్‌టీయూ అనంతపురం వీసీ సుదర్శనరావు, సినీనటి సంయుక్తా మీనన్, యాంకర్ భానుశ్రీ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పాఠశాల స్థలం కబ్జాకు యత్నం

– అడ్డుకున్న మహిళపై దాడి



కూటమి నేతల దాడిలో గాయపడి, చికిత్స పొందుతున్న మహిళ

శ్రీరంగరాజపురం : ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కబ్జాకు ప్రయత్నించిన వారిని అడ్డుకున్న మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని పాదలపల్లి దళితవాడలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పాదలిపల్లి దళితవాడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి గతంలో జయరామయ్య తల్లిదండ్రులు సర్వే నంబర్ 213/16లో 1.13 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇవ్వడం జరిగింది. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలను అభివృద్ధి పరిచారు. మిగిలిన స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించడానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు అయ్యాయి. కానీ అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. కూటమి ప్రభుత్వం రావడంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగులయ్య కుమారుడు శ్రీరాములు కబ్జా ప్రయత్నించాడు. భూకబ్జాను జయరామయ్య భార్య విజయ అడ్డుకోవడంతో ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన మహిళను స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుప్పంలో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో రూ.5.34 కోట్లతో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరులోని టాటా డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ఆధ్వర్యంలో కుప్పంలో ఒక సెంటర్‌ను ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ సెంటర్‌లో సేవలు అందించడానికి గత నెలలో కొందరు సిబ్బందిని డిప్యుటేషన్‌పై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్ నియమించారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్


గత నెలలో కలెక్టర్ జారీ చేసిన బదిలీ ఉత్తర్వులు

గుడిపాల: ఓ పంచాయతీ కార్యదర్శిని గుడిపాల మండలం నుంచి పాలసముద్రం మండలానికి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గత ఫిబ్రవరి 25వ తేదీన బదిలీ చేశారు. అయితే కలెక్టర్ ఉత్తర్వులను ఆ పంచాయతీ కార్యదర్శి ఏ మాత్రం లెక్కచేయలేదు. వెంటనే తనకు ఉన్న పలుకుబడితో తెలుగుదేశం నాయకుల వద్ద నుంచి అధికారులకు ఫోన్‌ల ద్వారా ఒత్తిడి తెప్పించారు. దీంతో అధికారులు కూడా అతన్ని రిలీవ్ చేయకుండా పెండింగ్‌లో పెట్టేశారు. వివరాలులోకి వెళితే.. 189 కొత్తపల్లె పంచాయతీకి పంచాయతీ కార్యదర్శిగా మోహన్ (గేడ్–3) పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా అతనిపై ఆరోపణలు రావడంతో అతన్ని పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీకి కార్యదర్శిగా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గత ఫిబ్రవరి 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కలెక్టర్ ఆదేశాలను ఏ మాత్రం లెక్క చేయకుండా టీడీపీ నాయకుల వద్ద నుంచి అధికారులకు ఫోన్‌లు చేయించి రిలీవ్ చేయకుండా నిలిపివేశారు. కలెక్టర్ ఆదేశాలను కూడా పట్టించుకోరా? అంటూ పలువురు గుసగుసలాడుతున్నారు.